నవతెలంగాణ

మెదక్

1

బుధవారం | 15 మే 2024 | www.navatelangana.com

సీబీఎస్ఈ ఫలితాలలో జాతీయస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాలలో సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయిలో చోటు దక్కించుకున్నారు. సోమవారం ప్రకటించిన ఫలితాల్లో ప్రజ్ఞాపూర్ విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయం సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిలు పల్లె శయన 500 మార్కులగాను 487 మార్కులు సాధించి జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచరన్నారు. అదేవిధంగా నూర్ సహస్ర వర్షిని 466, శాస్త్రుల యశస్విని 459 మార్కులు సాధించరన్నారు. పదవ తరగతిలో 63 మంది విద్యార్థులు పరీక్ష వ్రాయగా, 62 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించరన్నారు. జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పల్లె శయన ను , అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సహస్ర వర్షిని, శాస్త్రుల యశస్విని పాఠశాల కరస్పాండెంట్ గోపు ఇన్నారెడ్డి అభినందించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయపాల్ రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మారిన కరెంటు తీగలు

నవతెలంగాణ-అక్కన్నపేట



అక్కన్నపేట మండలం గౌరవెల్లి గ్రామానికి చెందిన రైతు బండి రవీందర్ వ్యవసాయ పొలంలో కరెంటు తీగలు ప్రమాదకరంగా మారాయి. ఈ విద్యుత్ తీగలను సరిచేయాలని లైన్మెన్ రాజేందర్‌కు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించు కోవడం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొలం దున్నే సమయంలో అలాగే వరి కోసే సమయంలో ట్రాక్టర్ నడిపే వ్యక్తులకు అవి తాకుతున్నాయన్నారు. షాక్ తగిలి ఎవరైనా మరణిస్తేకానీ అధికారులు పట్టించుకోరా అని ప్రశ్నించారు. ఈ విషయమై పై అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతు రవీందర్ కోరారు.



నీలం మధును కలిసిన కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-తొగుట

మెదక్ ఎంపీగా నీలం మధు ముదిరాజ్ 2 లక్షల మెజార్టీతో విజయం ఖాయమని మాజీ సర్పంచ్ పాత్కుల లిలాదేవి వెంకటేశం అన్నారు. మంగళవారం మండలంలోని వెంకట్రావుపేట గ్రామ మాజీ సర్పంచ్ పాత్కుల లిలాదేవి వెంకటేశం నీలం మధు ముదిరాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. బహుజన బిడ్డ కాంగ్రెస్ జెండాతో 2 లక్షల మెజార్టీతో విజయం సాధించి సోనియా గాంధీకి బహుమతి అందివ్వనున్నారన్నారు. నీలం మధుకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సీనియర్ నాయకులు ఆక్కరం సత్తయ్య మాజీ సర్పంచ్ కొత్త పల్లి సత్తయ్య, వోలపు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కౌంటింగ్ కేంద్రానికి చేరుకున్న ఈవీఎంలు

నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన ఈవీఎంలను పటాన్‌చెరు ప్రాంతంలోని గీతం యూనివర్సిటీకి తరలించినట్టు అధికారులు తెలిపారు. మంగళవారం ఉదయం గట్టి బందోబస్తు మధ్య కంటైనర్లలో ఈవీఎంలన్నింటినీ తరలించారు. మూడంచెల భద్రత విధానంలో ఈవీఎంలను భద్రపరిచినట్టు అసిస్టెంట్ ఎన్నికల అధికారి జహీరాబాద్ ఆర్డీఓ తెలిపారు. వివిధ పార్టీల నాయకుల సమక్షంలోనే ఈవీఎంల తరలింపు జరిగిందని అధికారులు తెలిపారు.

గీతం యూనివర్సిటీలో భద్రపరిచిన జహీరాబాద్ పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌ను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ రూపేష్‌లు పరిశీలించారు. ఈవీఎంలు మొరాయించకుండా వాటిని భద్రపరిచేందుకు అన్ని విధమైన కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు జిల్లా అధికారులు తెలిపారు.



ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఆశాలకు అందని రెమ్యునరేషన్

నవతెలంగాణ-తొగుట

ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ఆశాలకు ఎన్నికల రెమ్యునరేషన్ ఇవ్వడం లేదు. తమకు రెమ్యూనేషన్ ఇవ్వడం లేదని ఆశాలు మంగళవారం ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఎన్నికల విధుల్లో ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సిబ్బందితోపాటు ఆశా కార్యకర్తలు పాల్గొంటున్నారు. ఉదయం ఎన్నికలు ప్రారంభానికి ముందు నుంచి పూర్తి అయ్యేవరకు పోలింగ్ స్టేషన్ వద్ద ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి వివిధ రకాల మందులు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో పెట్టి వైద్యశిబిరంలో పాల్గొంటున్నామన్నారు. ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లకు వైద్య పరంగా ఇబ్బందులు పడకుండా ముందస్తుగా ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికలు పూర్తి అయ్యాక విధుల్లో పాల్గొన్న వివిధ శాఖల అధికారులకు, సిబ్బందికి ఎన్నికల రెమ్యునరేషన్ ఇస్తున్నారు కానీ ఆశాలకు మాత్రం రెమ్యునరేషన్ ఇవ్వడం లేదన్నారు. రెమ్యూనరేషన్ ఇవ్వరా అని అధికారులను అడిగినప్పుడు మీ పేరు ఇందులో లేదని, మీకు రెమ్యునేషన్ ఇవ్వడం లేదన్నారు. గత కొన్ని ఏండ్లుగా ఏ ఎన్నికలు వచ్చిన విధుల్లో పాల్గొంటు న్న మాకు రెమ్యునరేషన్ రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని శాఖల వారికి ఇచ్చినట్లు తమకు ఎంతో కొంత రెమ్యునరేషన్ ఇవ్వాలని ఆశాలు కోరుతున్నారు.

విదేశాల నుంచి స్వగ్రామానికి వచ్చి ఓటు..

గజ్వేల్ నియోజవర్గంలో 80.31 శాతం ఓట్లు నమోదు

గతంలో ఎన్నడు లేని విధంగా పార్లమెంట్ ఎన్నికలు

నవతెలంగాణ-గజ్వేల్ రూరల్



గతంలో ఎన్నడూ లేని విధంగా గజ్వేల్ నియో జకవర్గంలో పార్లమెంట్ ఎన్నికలు ఈ సంవత్సరం రసవ త్తరంగా కొనసాగాయి. గజ్వేల్ నియోజకవర్గం నుంచి విదేశా లలో ఉన్న ఓటర్లు సైతం స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవడం గమనార్హం. స్థానిక సంస్థల ఎన్నికల్లో కచ్చితంగా ఓటు వేయాలన్న నియమాన్ని అభ్యర్థులు ప్రతి ఒక్కరికి చెబుతారు. గత 20 ఏళ్లలో ఉమ్మడి మెదక్ జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు స్థానిక సంస్థల ఎన్నికలను తల పించాయి. అమెరికా, లండన్, ఇటలీ నుంచి గజ్వేల్ నియో జకవర్గ ఓటర్లు వచ్చి ఓట్లు వేయడం పలువురుని ఆశ్చ ర్యా నికి గురి చేసింది. గజ్వేల్ పట్టణానికి చెందిన గుర్రం శ్రీకాంత్ చౌదరి అనే వ్యక్తి గత పది సంవత్సరాల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగంపై అమెరికా వెళ్లారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల కోసం అక్కడి నుంచి ప్రత్యేక విమా నంలో గజ్వే ల్‌కు చేరుకున్నారు. పట్టణంలో ఓటు విలువలు తెలుసుకున్న అతను ఖర్చుకు వెనుకాడకుండా స్వగ్రామమైన గజ్వేల్‌కు వ చ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇది చూసిన పలు వురు అతనిని శభాష్ అంటూ మెచ్చుకున్నారు. ఓటు వజ్రా యుధమని దానిని పాలన కొనసాగించే అభ్యర్థికి ప్రజలకు ఉపయోగపడే వ్యక్తులను ఎన్నుకోవడంలో ప్రాథ మిక హక్కు అయిన ఓటు వేయాలని అతడు పలువురికి తెలియజేశారు. ఏది ఏమైనా గజ్వేల్ నియోజకవర్గంలో 80.31 శాతం పార్లమెంటు ఎన్నికల్లో ఓట్లు నమోదు కావడం గమనార్హం.

స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలు..

- పోలింగ్ సరళిపై పోస్ట్‌మార్టం
- మెదక్‌లో 75.09, జహీరాబాద్‌లో 74.63 శాతం పోలింగ్
- అంతుచిక్కని ఓటరు నాడితో అభ్యర్థుల్లో ఆందోళన
- జహీరాబాద్‌లో క్రాస్ ఓటింగ్.. మెదక్‌లో పోల్‌మేనేజ్‌మెంట్
- ఎవరి అంచనాలు వారివే.. గెలుపుపై మూడు పార్టీల ధీమా
- ఫలితం కోసం 20 రోజుల నిరీక్షణ



నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనఓట్లు	శాతం
మెదక్	218735	175409	80.19
నర్సాపూర్	227088	191315	84.25
సిద్దిపేట	237591	174969	73.64
గజ్వేల్	280913	225607	80.31
దుబ్బాక	200125	164952	82.42
సంగారెడ్డి	249775	179801	71.99
పటాన్‌చెరు	413983	260841	63.01

నియోజకవర్గం	మొత్తంఓట్లు	పోలైనఓట్లు	శాతం
జహీరాబాద్	275562	200597	72.80
అందోల్	250860	191320	76.27
నారాయణఖేడ్	237241	172508	72.71
బాన్సువాడ	202887	153855	75.83
జుక్కల్	196826	151516	76.98
ఎల్లారెడ్డి	223027	172928	77.54
కామారెడ్డి	255007	182325	71.50

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల్లోని ఈవీఎంలను స్ట్రాంగ్ రూంల్లో భద్ర పర్చారు. పోలింగ్ సరళిపై ఆయా పార్టీల అభ్యర్థులు పోస్టుమార్టం చేస్తున్నారు. పోలింగ్ ఓట్ల శాతాన్ని ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌ల వారిగా లెక్కలేస్తున్నారు. ఏఏ అంశాలు కలిసొచ్చాయో ఏ విషయంలో ప్రతికూలత ఏర్పడిందనే అంశాలపై చర్చిస్తున్నారు. అంతు చిక్కని ఓటరు నాడి అర్థం కాకపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. జహీరాబాద్‌లో క్రాస్ ఓటింగ్, మెదక్‌లో పోల్ మేనేజ్‌మెంట్‌పై చర్చ జరుగుతోంది. ఎన్నికల ఫలితాలు తేలేందుకు మరో 20 రోజులు నిరీక్షించాల్సి ఉంది. గతేడాది కంటే కూడా రెండు పార్లమెంట్ నియోజ కవర్గాల్లోనూ పోలింగ్ శాతం పెరిగింది. ఇది ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలంగా ఉంటుందనే విశ్లేషణ చేస్తున్నారు.

పెరిగిన పోలింగ్ శాతం

మెదక్, జహీరాబాద్ రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లోనూ పోలింగ్ ప్రశాంతంగా జరగడంతో రీపోలింగ్‌కు అవకాశంలేదు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతం కంటే ఈ సారి కాస్త ఓటింగ్ పెరిగింది. రాష్ట్రంలోనే అత్యధికంగా పోలింగ్ నమోదైన పార్లమెంట్ నియోజకవర్గాల్లో మెదక్ రెండో స్థానంలో ఉంది. పార్లమెంట్ నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి 75.09 శాతం పోలింగ్ నమోదైంది. 18,28,210 మంది ఓటర్లుండగా 13,72,894 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో 73.64 శాతం, మెదక్‌లో 80.19 శాతం, నర్సాపూర్‌లో 84.25 శాతం, సంగారెడ్డిలో 71.99 శాతం, పటాన్‌చెరులో 63.01 శాతం, దుబ్బాకలో 82.42 శాతం, గజ్వేల్ నియోజకవర్గంలో 80.31 శాతం పోలింగ్ నమోదైంది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 74.63 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గంలో 16,41,410 మంది ఓటర్లుండగా వీరిలో 12,25,049 మంది పోలింగ్‌లో పాల్గొన్నారు. జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో 72.80 శాతం, అందోల్ నియోజకవర్గంలో 76.27 శాతం, నారాయణఖేడ్ నియోజకవర్గంలో 72.71, కామారెడ్డిలో 71.50 శాతం, ఎల్లారెడ్డిలో 77.54 శాతం, జుక్కల్‌లో 76.98 శాతం, బాన్సువాడ నియోజకవర్గంలో 75.83 శాతం పోలింగ్ నమోదైంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో గత పార్లమెంట్ ఎన్నికల కంటే 04 శాతం పోలింగ్ అదనంగా నమోదైంది.

జహీరాబాద్‌లో క్రాస్‌ఓటింగ్.. మెదక్‌లో పోల్‌మేనేజ్‌మెంట్‌పై చర్చ

పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యాక పోలింగ్ సరళిపై అనేక విశ్లేషణలు వస్తున్నాయి. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో పోల్ మేనేజ్‌మెంట్ ప్రభావంపైన చర్చ జరుగుతుంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోనేమో క్రాస్ ఓటింగ్ గురించి చర్చిస్తున్నారు. ఈ రెండు వేర్వేరు అంశాలైనప్పటికీ గెలుపోటముల్ని ప్రభావం చూపే అవకాశం లేకపోలేదంటున్నారు. మెదక్ లోక్‌సభలో పోటీ చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ గెలుపు కోసం సర్వ శక్తుల్ని ఒడ్డాయి. భారీ బహిరంగ సభలు, జోరు ప్రచారాలతో హోరెత్తించాయి. కానీ..! చివరి రెండు రోజులు జరిగిన పోల్ మేనేజ్‌మెంట్ ప్రక్రియనే ఓటర్లను ప్రభావితం చేసిందనే చర్చ వినిపిస్తుంది. మెదక్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ పోల్ మేనేజ్‌మెంట్ జరగ లేదు. ఒక్కో పార్టీ ఒక్కో విధంగా వ్యవహరించాయి. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పోల్ మేనేజ్‌మెంట్ పర్ఫెక్ట్‌గా చేసిందంటున్నారు. ఓటుకు రూ.500, మద్యం సీసా కూడా పంపిణీ చేసిందని తెలు స్తోంది. కేసీఆర్, హరీశ్‌రావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజ కవర్గాలు కావడంతో సహజంగానే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డికి భారీ మెజార్టీ వస్తుందని చెబుతున్నారు. అందుకు అక్కడ పోల్ మేనేజ మెంట్‌పై ఆ పార్టీ దృష్టిందని చెబుతున్నారు. అక్కడ కాంగ్రెస్ అభ్యర్థి సైతం తమ తమ పద్ధతుల్లో పోల్ మేనేజ్‌మెంట్ చేశారు. బీజేపీ సైతం మోడీ పట్ల ఉన్న క్రేజీ కలిసొస్తుందని భావించినా ఓటర్లకు మద్యం, డబ్బులు పంపిణీ చేసింది. మూడు పార్టీలు చేసిన ప్రయో గాలు ఎవరికి ఫలిత ాలనిస్తాయో వేచి చూడాలి. ఇక జహీరా బాద్ లోక్‌సభ పరి ధిలో పోలింగ్ సరళి పరిశీలిస్తే... క్రాస్ ఓటింగ్ పైనే ప్రధ నంగా చర్చ నడుస్తోంది. బీఆర్ఎస్, బీజే పీ, కాంగ్రెస్ మూడు పోటీ పడ్డాయి. అయితే చివరి దశలో బీఆర్ఎస్ శ్రేణులు క్రాస్ ఓటింగ్ చేసినట్లు ప్రచారం సాగిం ది. బీఆర్ఎస్ అభ్యర్థి గట్టి పోటీ ఇవ్వకపోవడం వల్ల ఆ పార్టీ శ్రేణులు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ వైపు మళ్లినట్లు చెబు తున్నారు. కొంతరేమో కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను చూసి హస్తం గుర్తుకు ఓటేసినట్లు తెలుస్తోంది.



స్ట్రాంగ్ రూంల్లో ఈవీఎంలు భద్రం..

పోలింగ్ ముగిసిన వెంటనే ఆయా పోలింగ్ కేంద్రాల నుంచి ఈవీఎంలను తరలించారు. జీయో ట్యాంగింగ్ ద్వారా పోలీస్ పహారాలో ఈవీఎంలను సోమవారం రాత్రే స్ట్రాంగ్ రూంలకు చేర్చారు. మంగళవారం ఎన్నికల అబ్జర్వర్లు పలువురు అభ్యర్థుల తరపున వచ్చిన ప్రతినిధుల సమక్షంలో స్క్రూటినీ చేశారు. ఆ తర్వాత స్ట్రాంగ్ రూంలకు సీజ్ వేసి భద్రత పెట్టారు. మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఈవీఎంలను రెండు చోట్ల ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంల్లో పెట్టారు. సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, నర్సాపూర్, మెదక్ నియోజ కవర్గాలలోని ఈవీఎంలను నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ స్ట్రాంగ్ రూంల్లో భద్రపర్చారు. సంగారెడ్డి, పటాన్‌చెరు పరిధి లోని ఈవీఎంలను ప్రభుత్వ గిరిజన జూనియర్ కళాశాలలో భద్రపర్చారు. అదే విధంగా జహీరాబాద్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఈవీఎంలను పటాన్‌చెరు మండలంలోని రుద్రారంలో ఉన్న గీతం యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూంల్లో పెట్టారు. స్ట్రాంగ్ రూంల వద్ద మూడు అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. కేంద్ర సాయుధ బలగాలు 24 గంటల పాటు పహరా కాయనున్నాయి. సీసీటీవీ కెమెరాల నిఘా కొనసాగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు క్రాంతి వల్లూరు, రాహుల్ రాజ్ తెలిపారు.

20 రోజుల నిరీక్షణ..

ఎన్నికల ఫలితాలు తేలేందుకు మరో 20 రోజుల నిరీక్షించాలి. పోలింగ్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఫలితాలెలా ఉంటాయో అన్న ఉత్కంఠ నెలకొంది. కానీ..! మరో మూడు దశల్లో ఎన్నికలు పూర్తయ్యాక జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. దీంతో మరో 20 రోజుల పాటు ఎన్నికల ఫలితాల కోసం ఎదురుచూడక తప్పదు. పోలింగ్ ముగిసినందున ఈ 20 రోజుల పాటు వివిధ రకాల విశ్లేషణలు, అంచనాలు, కూడికలు, తీసివేతలతోనే అభ్యర్థులు ఉత్కంఠ పరిస్థితిని ఎదుర్కోక తప్పదు.

ప్రజా సమస్యలపై పోరాడేది కమ్యూనిస్టులే

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు

నవతెలంగాణ-సంగారెడ్డి



ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. హైదారాబాద్‌లో మంగళవారం జరిగిన సంగారెడ్డి జిల్లా సీపీఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. ఈ ప్రజా సమస్యల పరిష్కారం కోసం రానున్న కాలంలో బలమైన పోరాటాలు చేస్తామన్నారు. కార్మికులు, కర్షకులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని, నేటికీ ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతున్నామన్నారు. భూ పోరాటాలతో పాటు, తాగునీరు, సాగునీరు కోసం అవిశ్రాంత పోరాటాలు నిర్వహిస్తూ ప్రజల పక్షాన సీపీఐ(ఎం) నిలిచిందన్నారు. కేంద్రంలోని ప్రభుత్వాన్ని నిలదీసి వాటి పరిష్కారం కోసం ఉద్యమించే తత్వం కమ్యూనిస్టులకు మాత్రమే ఉంద న్నారు. గత యూపీఏ ప్రభుత్వంలో వామపక్షాల బలం ఉన్న కారణంగానే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సాధించుకోవడంతో పాటు, అటవీ హక్కుల చట్టాన్ని సాధించుకున్నామన్నారు. బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత ఈ చట్టాలను తుంగలో తొక్కి, మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని విమర్శించారు. తెగలు, కులాల మధ్య వైశ్యమ్యాలు రెచ్చగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం మనువాదాన్ని తెచ్చేందుకు ప్రయత్నం చేస్తునదన్నారు. పేదల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం, కార్యదర్శి వర్గ సభ్యులు బీరం మల్లేష్, కె.రాజయ్య, ఎ.మానిక్, జి.సాయిలు, నర్సమ్మ, మహేందర్ రెడ్డి, భస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి డబ్బులు చెల్లించడం లేదని కూలీల ఆందోళన

నవతెలంగాణ-జహీరాబాద్



నెలల తరబడి నుంచి కూలీ డబ్బులు పెండింగ్‌లో ఉన్నాయని.. వెంటనే వాటిని చెల్లించాలని కోరుతూ మండలంలోని అల్గోలు గ్రామ ఉపాధి హామీ కూలీలు ఆందోళన చేపట్టారు. సుమారు 200 మంది కూలీలు వచ్చి స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళకు దిగారు. నెలల తరబడి నుంచి కూలీ డబ్బులు ఇవ్వక పోవడంతో.. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కాగా సెలవు దినం కావడంతో అధికారులెవరూ స్పందించకపోవడంతో ఉద్యమాన్ని వాయిదా వేస్తున్నట్టు ప్రకటించి అక్కడి నుంచి కూలీలు వెళ్లిపోయారు. అయితే 200 మంది కార్మికులు ఎంపీడీవో కార్యాలయానికి లారీలను తీసుకువచ్చి ఆందోళన చేయడాన్ని బట్టి.. అధికారుల పని విధానం ఏ విధంగా ఉందో అర్థమవుతున్నదని పలువురు మండిపడ్డారు. కూలీలకు రోజువారి వేతనం రూ.220 నుండి 230 మాత్రమే చెల్లిస్తున్నారని పలువురు కూలీలు వాపోయారు. సరైన సౌకర్యాలు లేకపోవడంతో కొందరు కూలీలు మృతి కూడా చెందారని.. ఈ విషయమై తక్షణమే అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మాదిరిగా రోజుకు రూ.300 వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో ఉపాధి కూలీలు నాగన్న, నర్సింలు, రాములు, చంద్రన్న పెట్టమ్మ, మారుతి తదితరులు పాల్గొన్నారు.



హజ్‌కు వెళ్లే యాత్రికుడికి సన్మానం

నవతెలంగాణ-ఝరాసంగం

సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరమైన మక్కాకు సంగారెడ్డి జిల్లా ఝరాసంగం గ్రామానికి చెందిన యువకుడు హజ్ యాత్రకు వెళ్ళనున్నారు. ఈ నేపథ్యంలో డాక్టర్ హరీఫ్‌ను ఎండి శోకత్ అలీ తన నివాసంలో ఘనంగా శాలువా,పూలమాలలతో సన్మానించారు. అల్లా దయ అందరిపై ఉండాలని ఆయన కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు మహమ్మద్ ఆన్సర్, మొహమ్మద్ ఫెరోజ్, మహమ్మద్ తాజుద్దీన్, మహమ్మద్ అజీమ్, మొహమ్మద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయం ఖాయం

నవతెలంగాణ-రాయపోల్



మెదక్ బీఆర్ఎస్ పార్లమెంటు అభ్యర్థి వెంకట రామిరెడ్డి విజయం ఖాయమనిమెదక్ పార్లమెంటు నియోకవర్గ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కెఆర్ భీమసేన ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 తేదిన జరిగిన లోక్ సభ ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట రామిరెడ్డి మెదక్ పార్లమెంటు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటారని ప్రజలు విశ్వసించారన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో కేంద్రంలో ఏర్పడబోయే ప్రభుత్వంతో కొట్లాడి నియోజకవర్గ అభి వృద్ధి, సమస్యలపై పోరాడటానికి సరైన నాయకుడు వెంకట రామిరెడ్డి మాత్ర మేనని ప్రజలు నమ్ముతున్నారన్నారు. ఓటింగ్ సరళిని పరిశీలిస్తే బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమని స్పష్టం అవుతోందన్నారు. బిజెపి ప్రభుత్వం హిందూ మతో న్మాద ముసుగులో ఓట్లు అడిగారు తప్ప దేశ ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి, ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పడం లేదన్నారు. సేవా దృక్పథం ఉన్న వెంకట రామిరెడ్డిని గెలిపిస్తే మెదక్ నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తారని ప్రజలు భావించా రన్నారు. కావున మెదక్ ఎంపీగా వెంకట రామిరెడ్డి భారీ మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తొగుట కోఆప్షన్ సభ్యులు కలిమోద్దీన్, బీఆర్ఎస్ నాయకులు ఆస బాబు, రాజు, చింతకింది మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సంగారెడ్డి
2
బుధవారం | 15 మే 2024 | www.navatelangana.com

గ్రామాధ్యక్షుడిని సన్మానించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఝరాసంగం



ఝరాసంగం మండల పరిధిలోని కంబాలపల్లి బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు బగ్లి విజయ్ కుమార్ పాటిల్ జన్మదినం సందర్భంగా మంగళవారం జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు తన క్యాంపు కార్యా లయంలో శాలువా, పూల మాలవేసి శుభాకాంక్షలు తెలి పారు. భవిష్యత్తులో మంచి నాయకుడిగా ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వెంకటేశం, మాజీ ఉప సర్పంచ్ మాణిక్ యాదవ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల్లో ఈవీఎంలు భద్రం

నవతెలంగాణ-సంగారెడ్డి



జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని 7-అసెంబ్లీ సెగ్మెంట్లకు సంభందించిన ఈవీఎంలను రుద్రారం, గీతం యునివర్సిటీలో, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంభందించి, సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ సెగ్మెంట్లకు సంభందించిన ఈవీఎంలను బి.వి.ఆర్.ఐ.టి. నర్సాపూర్‌లో భద్రపరిచారు. జూన్ 4న జరిగే కౌంటింగ్ వరకు స్ట్రాంగ్ రూమ్స్ వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు, రాష్ట్ర సాయుధ బలగాలు మరియు జిల్లా సివిల్ పోలీసులతో మూడంచెల పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రూపేష్ వివరించారు. డీఎస్పీ స్థాయి అధికారి 24 గంటలు పర్యవేక్షిస్తారన్నారు. స్ట్రాంగ్ రూమ్స్ వద్ద, యునివర్సిటీ ఆవరణ అంతా సీసీటీవి పర్యవేక్షణలో వుంటుందని వివరించారు.

మెదక్‌లో గులాబీ జెండా ఎగరడం ఖాయం



నవతెలంగాణ-సంగారెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు మద్దతుగా పని చేసిన, కార్యకర్తలకు, నాయకులకు ప్రజా ప్రతినిధులకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యారంటీల అమలులో విఫలమైన కాంగ్రెస్ పై ప్రజల్లో వ్యతిరేకత మొదలై ందన్నారు. బీఆర్ఎస్‌కు ఎంపీ ఎన్నికలో అత్యధిక ఎంపీ స్థానాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే... బీఆర్ఎస్ పోలింగ్ శాతం పెరుగు తుందన్నారు. లక్ష మెజార్టీతో మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి విజయం సాధిస్తారన్నారు. ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్ కార్యకర్తలను బెదిరించాంని.. బెదిరింపులకు బీఆర్ఎస్ కార్యకర్తలు భయపడరన్నారు. కాంగ్రెస్ టైమ్ పాస్ రాజకీయాలు చేస్తున్నదని ఆరోపించారు.



ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మనూర్

నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పి.సంజీవ్ రెడ్డి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని బోరంచ గ్రామంలో గల నల్లపోచమ్మ దేవాలయం వద్ద జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అంతర్జాతీయ నర్స్ డే సందర్భంగా ఖేడ్ ప్రభుత్వఆసుపత్రి సిబ్బందితో కూడా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ వేడుకలకు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు, మాజీ ఎంపీ సురేష్ శెట్కార్‌లు పాల్గొని ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలం పార్టీ నాయకులు, ఖేడ్ మునిసిపల్ పాలక వర్గం సభ్యులు, నియోజకవర్గం వర్గం పార్టీ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

17న కేఎస్ పీపీ పట్టభద్రుల దినోత్సవం

నవతెలంగాణ-పటాన్‌చెరు

కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్ పీపీ) ద్వితీయ పట్టభద్రుల దినోత్సవాన్ని ఈనెల 17న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్ ప్రాంగణంలోని కిన్నెర సెమినార్ హాల్లో ఉదయం 11.00 గంటలకు నిర్వహించనున్నారు. ముఖ్య అతిథిగా జాతీయ మానవ హక్కుల కమిషన్ చైర్ పర్సన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా హాజరు కానున్నారు. పబ్లిక్ పాలసీ స్నాతకోత్తర (పీజీ) డిగ్రీని పూర్తి చేసిన దాదాపు 25 మంది విద్యార్థులకు ఈ సందర్భంగా పట్టాలను ప్రదానం చేయనున్నారు.గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్, కేఎస్ పీపీ సహ వ్యవస్థాపకుడు ప్రతీక్ కన్వాల్, కులపతి వీరందర్ సింగ్ చౌహాన్, ఉపకులపతి దయానంద సిద్ధవట్టం, గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, కేఎస్ పీపీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, రిజిస్ట్రార్ డి.గుణశేఖరన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఈ వేడుక గ్రాడ్యుయేషన్ విద్యార్థుల విజయాలను జరుపుకోవడంతో పాటు సమాజ భవిష్యత్తును రూపొందించడంలో పబ్లిక్ పాలసీ ప్రాముఖ్యతను నొక్కి చెప్పనుంది.

సజావుగా ముగిసిన పోలింగ్

నవతెలంగాణ-న్యాల్‌కల్

మండలంలోని 62 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సజావుగా జరిగిందని ఎన్నికల అధికారులు తెలిపారు. మండలంలో 48,163 మంది ఓటర్లు ఉండగా.. 35,689 మంది ఓటు హక్కును వినియోగించుకు న్నారు.74.10శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారులు తెలిపారు. కాగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన మండల ఓటర్లు, వివిధ రాజకీయ పార్టీలకు ధన్యవాదాలు తెలిపారు.



మీర్ఖాన్‌పేటలో హెూరాహెూరీగా కుస్తీ పోటీలు

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని మీర్ఖాన్ పేట గ్రామంలో దుర్గమ్మ జాతర పురస్కరించుకొని మాజీ సర్పంచ్, పార్టీ మండల ఉపాధ్యక్షులు నీరుడి యాకోబ్, మాజీ ఉపసర్పంచ్ శివరాంపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈడీగ రాజు గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం కుస్తీ పోటీలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కుస్తీ పోటీల్లో కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంత మల్లయోధులు పాల్గొ న్నారు. చివరి కుస్తీ పోటీలో ఉద్గిర్ మహారాష్ట్రకు చెందిన అయూబ్ మరి యు బీద్రాలి నాందేడ్ కు చెందిన సంజు తలపడగా.. సంజీవ్ పై అయూబ్ గెలు పొందారు. మొదటి బహుమతిగా రూ.6500 గ్రామస్తులు వారికి అందజేశారు. కుస్తీ పోటీల కార్యక్రమానికి దాతలుగా వార్డ్ మెంబర్ యస్పాల్, కుమ్మరి విఠల్‌లు అన్నదానం స్పాన్సర్ చేశారు. కావాల్సిన సామాగ్రిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జైలు అందజేశారు. టెంటు, సౌండ్ సిస్టంను బీఆర్ఎస్ జిల్లా నాయకులు సీనూరి సాయిలు, వార్డు మెంబర్ కురుమ అంజయ్య అందజేశారు. కుస్తీ పోటో పోటీలో గ్రౌండ్ ప్రిపేర్ డప్పు సప్పులు, పనివారికి కావాల్సిన వాటిని బీజేపీ సీనియర్ నాయకులు శివరాంపల్లి కిష్టయ్య అందజేశారు. ఈ కుస్తీ పోటీల నిర్వాణకు దాతలు దశరథ్, సీనూరి సాయిలు, మేదరి చిన్న అంజయ్యలు సహకరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ కానిస్టేబుల్ దశరథ్, అన్నారావు పంతులు, బొక్క పెద్ద సాయిలు, బొక్క పెద్ద భూమయ్య, అబ్రహం, అమృత్, కూలి నాందేవ్, ముప్పిడి పెద్ద సాయిలు తదితరులు పాల్గొన్నారు.



ఈవీఎంల్లో భవితవ్యం

- గెలుపు పై ఎవరికి వారే ధీమా..
- ప్రధాన పార్టీల మధ్యే పోటీ అంటున్న సర్వేలు

నవతెలంగాణ-జహీరాబాద్

లోక్‌సభ ఎన్నికలు ముగిశాయి. ఇక అభ్యర్థుల భవితవ్యం ఈవీఎ ంల్లో నిక్షిప్తమైంది. గత నెల రోజులుగా ప్రతీ రోజు ప్రచా రం లో నిమగ్నమైన అభ్యర్థులు.. ప్రస్తుతం విశ్రాంతి తీస ుకుం టున్నారు. అయితే గెలుపుపై మాత్రం ఎవరికి వారే ధీమాగా ఉన్నారు.

జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో అనూహ్యంగా బీజేపీ పుంజుకున్నదని.. ప్రస్తుతం ఇక్కడ కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ నెలకొన్నదని విశ్లేషకులు చెబుతున్నారు. బీజేపీ అభ్య ర్థిగా పోటీ చేసిన బీబీ పాటిల్ రెండు పర్యాయాలు బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి గెలుపొందిన విషయం తెలిసిందే. మూడోసారి బీజేపీపోటీ చేసి హ్యాట్రిక్ కొట్టాలని పాటిల్ శాయశక్తుల్లా కృషి చేశారు. గతంలో ఎన్నడూ లేని విధగా ఆయన భార్య, కొడుకు, కోడలు ముమ్మర ప్రచారాన్ని నిర్వహించిన విషయం తెలిసింది. జహీరాబాద్ పార్లమెంటు ఏర్పడిన అనంతరం మొదటి పార్లమెంటు సభ్యుడిగా గెలుపొందిన సురేష్ షెట్కర్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో దిగారు. ఆయన గెలుపు కోసం కుటుంబ సభ్యులు కూడా శాయశక్తులా కృషి చేశారు. బీఆర్ఎస్ నుంచి గాలి అనిల్ కుమార్ బరిలోకి దిగగా.. పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేశారు. జహీరాబాద్‌కు కొత్తవాడైన అనిల్ కుమార్ పార్టీ కార్యకర్తలతో మమేకమై ప్రచారాన్ని సాగించారు. కాగా హోరాహోరీగా సాగిన ఈ ప్రచారాల్లో ఓటర్లు ఎవరు వైపు నిలిచారో తెలియాలంటే ఇంకా కొన్ని రోజులు వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా జహీరాబాద్‌లో ఎక్కడా త్రిముఖ పోటీ కనిపించలేదని.. జాతీయ పార్టీలైనా బీజేపీ, కాంగ్రెస్ మధ్యే పోటీ ఉన్నదని పలువురు విశ్లేషకులు చెబుతున్నారు. ఇప్పటికే ఆయా పార్టీల ముఖ్య నాయకులు బూత్‌ల వారీగా సమీక్షలు నిర్వహించి.. వారికి పోలైన ఓట్లకు అంచనాలు వేస్తున్నారు. మరి ఓటర్ మహాశయులు ఎవరి వైపు మొగ్గు చూపారన్నది కౌంటింగ్ అనంతరమే తేలుతుంది కాబట్టి.. ఇంకా కొన్ని రోజులు ఈ ఉత్కంఠ ఇలాగే కొనసాగనున్నది.

భారీగా బెట్టింగులు..

జహీరాబాద్ పార్లమెంటుకు సంబంధించి కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు తమ అభ్యర్థే గెలుస్తాడని భారీగా బెట్టింగ్లు నిర్వించినట్టు సమాచారం.కాగా ఈ విషయమై అధికారులు దృష్టి సారించినట్టు తెలుస్తోంది.



ఉపాధ్యాయులపై లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నాం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వై.జ్ఞానమంజరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని ఖండిస్తూ టీఎస్‌యూటీఎఫ్ సంగారెడ్డి జిల్లా కార్యాలయంలో మంగళవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జ్ఞాన మంజరి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ చేసిన ఆర్డీఓ మరియు పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పీఓ, ఏపీఓలకు రోజుకు రూ.600, ఓపీఓలకు రూ.400గా రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం. 691ని ఈ నెల 11న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పీఓ, ఏపీఓలకు రూ.3150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో రూ.2400 మాత్రమే ఇచ్చారన్నారు. ఈసీ ఆదేశాలకు విరుద్ధంగా సంగారెడ్డి జిల్లాలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో తక్కువ పారితోషకం చెల్లించడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, జిల్లా నాయకులు సాయి తేజ, కేశవరావు, ప్రభాకర్ ,సుధాకర్, అనురాధ ఇతర ఉపాధ్యాయులు, ఉద్యోగులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి గాయపరిచారుని మండిపడ్డారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, సీఐ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై చరణ్‌రెడ్డి, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, జిల్లా కోశాధికారి పి. శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి సాయి తేజ, దేవేందర్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

లాఠీచార్జ్‌ను ఖండిస్తున్నాం..

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజు



నవతెలంగాణ-సంగారెడ్డి


ఎలక్షన్ విధులు నిర్వహించిన ఉపాధ్యాయ, ఉద్యోగులకు తక్కువ రెమ్యునరేషన్ ఇవ్వడం సరికాదని ప్రశ్నించినందుకు.. నారాయణఖేడ్ ఆర్‌డీఓ అతి ఉత్సాహం వల్ల ఉపాధ్యాయులపై, ఉద్యోగలపై జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జయరాజ్ తెలిపారు. ఈ విషయమై ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ఉపాధ్యాయ ఉద్యోగులపై లాఠీచార్జ్‌కు కారకులైన ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ ఉద్యోగులకు రావాల్సిన రెమ్యునరేషన్ కరెక్టుగా ఇవ్వాలని కోరారు.

ఉపాధ్యాయులపై లాఠీఛార్జ్‌ను ఎస్‌టీయూటీఎస్ ఖండించింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ సాబేర్ అలి, శ్రీనివాస్ రాథోడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల అధికారి ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు స్థానిక ఎన్నికల అధికారి పోలీసులతో లాఠీఛార్జ్ చేయించడం అమానుష మన్నారు. లాఠీచార్జికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నారాయణఖేడ్‌రూరల్ : ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జి చేయించడాన్ని ఖండిస్తూ స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర సభ్యులు కాశీనాథ్ జాదవ్ మాట్లాడుతూ.. ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని.. నిబంధన మేరకు పోలింగ్ సిబ్బంది అందరికీ రెమ్యూనరేషన్ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా.. చెల్లింపుల్లో తేడాలెందుకున్నాయని ప్రశ్నించారు. ఈ విషయాన్ని అడిగినందుకు లాఠీచార్జ్ చేయడం సరైంది కాదన్నారు. నిబంధనలను పాటించకుండా, ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ మరియు పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అశోక్, జిల్లా కార్యదర్శి లు ఎసప్ప, నరేష్‌లు, డివిజన్ నాయకులు హరిసింగ్, దేవదానం, విఠల్, కాశీరాం,అంజయ్యలు పాల్గొన్నారు



కంగ్టి : నిబంధనల ప్రకారం ఇవ్వాల్సిన రెమ్యునరేషన్‌ల చెల్లింపులో తేడాలు ఎందుకని ప్రశ్నించిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, ఉపాధ్యులపై స్థానిక ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణ రహితంగా లాఠీఛార్జ్ చేయడం దుర్మార్గమని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి, అంజయ్య, స్వామిలు అన్నారు. ఉపాధ్యాయులపై లాఠీఛార్జ్ చేయించిన ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కొనుగోలు కేంద్రాల్లో ఇష్టారాజ్యం

- సెంటర్లకు తీసకొచ్చి 20 రోజులవుతున్న తూకం వేయని నిర్వాహకులు
- ఓ పక్క వర్షాభావ పరిస్థితులు, మరోపక్క టార్పాలిన్ కిరాయిలతో రైతులకు ఇబ్బందులు



నవతెలంగాణ-పుల్కల్

రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువస్తే అక్కడి నిర్వాహకులు తమ ఇష్టాను సారంగా తూకం వేస్తున్నారు. అదేంటని ప్రశ్నిస్తే మీ వడ్లు మ్యాచర్ రాలేదు.. తేమ లేదు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని రైతులు వాపోతున్నారు. 20 రోజుల క్రితం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసు కువస్తే.. ఇప్పటికీ తూకం వేయట్లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. తూకం వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీఏసీఎస్ ఆధ్వర్యంలో పుల్కల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత కొన్ని రోజులుగా రైతులు ఈ సెంటర్‌కు ధాన్యాన్ని తీసుకువస్తున్నారు. అయితే గత ఇరవై రోజుల క్రితం ఈ కేంద్రానికి ధాన్యాన్ని తీసుకువచ్చినా.. ఇప్పటికీ తూకం వేయట్లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఇదేంటని అడిగితే తేమశాతం రావట్లేదంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కొంతమంది పెద్ద రైతుల ధాన్యాన్ని రెండు మూడ్రోజుల్లోనే తూకం వేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవలే సహకార సంఘం సీఈవో నాగయ్యను రైతులు రెండు గంటలపాటు నిలదీశారు. అయినప్పటికీ సమ స్య పరిష్కారం కాలేదని రైతులు వాపోతున్నారు. సీఈఓ తన ఇష్టారాజ్యంగా తనకు తెలిసిన వారి ధాన్యాన్ని రాత్రుల్లో తూకం వేయిస్తున్నారని ఆరోపణలు చేశారు. ఏ ఒక్క అధికారి పర్యవేక్షణ చేయకపోవడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని రైతులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సన్న చిన్న కారు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి ప్రయివేటు వ్యాపారుల వద్ద పాలిథిన్ కవర్లు అద్దెకు తెచ్చుకుంటున్నారు. ఒక్క పాలిథిన్ కవర్‌కు రోజుకు 15 నుంచి 20 రూపాయల వరకు అద్దె పడుతుంది. ఒక్కొ రైతు 15 నుంచి 20, 25, 30 పాలిథిన్ టార్పలిన్లు తెచ్చి ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. గత ఇరవై రోజులుగా ఇదే పరిస్థితి ఉండడంతో.. టార్పలిన్ కవర్ల కిరాయి కూడా రైతులపై భారంగా మారుతున్నది. ఆరుగాలం కష్టపడి పంట రోజులు అవుతుంది తాము ఆరుగాలం కష్టపడి పండించడం ఒక ఎత్తు అయితే.. ధాన్యాన్ని తూకం వేయడం ఒక ఎత్తుగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పుల్కల్ సహకార సంఘంలో విధులు నిర్వహిస్తున్న సీఈఓను వెంటనే విధుల నుండి తొలగించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తమ ధాన్యాన్ని వెంటనే తూకం వేయాలని కోరుతున్నారు. లేనియెడల రైతులమంతా ఏకమై జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.



ఇటీవలే సీఈఓను నిలదీస్తున్న రైతులు..

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానం



నవతెలంగాణ-మునిపల్లి

ఇటీవల జరిగిన పదో తరగతి పరీక్షల్లో మండలంలోని తాటిపల్లి గ్రామానికి చెందిన 8మంది విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగా.. తాటిపల్లి గ్రామానికి చెందిన దివంగత మాజీ ఎంపీటీసీ కుమారుడు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి జి.పాండు ఆధ్వర్యంలో మంగళవారం సదరు విద్యార్థులను సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ రాంరెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివినప్పుడే ఉన్నత స్థానాలు అధిరోహిస్తారన్నారు. తమ గ్రామానికి చెందిన 8 మంది విద్యార్థులు పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. అలాగే మండలంలో విద్యాభివృద్ధికి మంత్రి దామోదర రాజనర్సింహ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. విద్యార్థులు సర్కారు బడుల్లోనే మెరుగైన విద్య ఉందన్నారు. అంతకుముందు ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సన్మానించి మెమోంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వెంకట లక్ష్మారెడ్డి, ఓడీఎఫ్ పాండు, మాజీ జెడ్పీటీసీ పెంటయ్య, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు నర్సింలు, భాస్కర్, కనకరాజు, మారుతి, మహిపాల్, ఏసయ్య విఠల్, మల్లేశం, సింగితం అంబన్న తదితరులు పాల్గొన్నారు.

సమన్వయం, సమిష్టి కృషితో ఎన్నికలు విజయవంతం

జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హర్షం



నవతెలంగాణ-మెదక్


ఎన్నికల నిర్వహణలో భాగస్వాములైన అధికారులు, అనధికారులు, జిల్లా ప్రజలు, పాత్రికేయుల సమాన్వయం, సమిష్టి కృషితో పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా ముగిశాయని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన మార్చి 16 నుంచి మే 13వ తేదీ వరకు ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసే వరకు ఎన్నికల నిర్వహణలో జిల్లా ప్రజల సహాయ, సహకారాలు భాగస్వామ్యం మరువలేనిదని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా, నిష్పక్షపాతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరిని ఆయన అభినందించారు. మన జిల్లాలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడం చాలా సంతోషమన్నారు. పోలింగ్ సమయం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకే అయినప్పటికీ ఓటర్లు పెద్ద ఎత్తున ఎండలను సైతం లెక్కచేయక ఓటు హక్కు వినియోగించుకోవడంలో చైతన్యం చాటారని, అందువల్ల గత పార్లమెంటు ఎన్నికల కంటే దాదాపు 04% శాతం అధికంగా పోలింగ్ నమోదు జరిగిందని తెలిపారు.

ఉపాధ్యాయులపై లాఠీ చార్జి చేయించిన వారిపై చర్యలు తీసుకోవాలి

టీపీటీఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-పాపన్నపేట : నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీ చార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంగయ్య వెంకటరామిరెడ్డిలు డిమాండ్ చేశారు. తమకు రావాల్సిన 5 రోజుల భత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఏక రీతిగా ఇవ్వాలని డిమాండ్ చేసినందుకు లాఠీ చార్జ్ చేయడమేంటని వారు ప్రశ్నించారు. న్యాయంగా తమకు రావాల్సిన వేతన భత్యాలను ఇవ్వాలని అడిగిన వారిపై పోలీసు బలగాలతో లాఠీ చార్జి చేయడం అత్యంత ధారుణమన్నారు. ఎన్నికల శిక్షణలో ఉపాధ్యాయులు విధుల పట్ల ఎంతో అంకిత భావంతో పనిచేస్తారని పొగిడిన అధికారులే, పనులు ముగించుకున్నాక దాడులు చేయించడం హేయమైన చర్య అన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ, గొడవకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు.

భారీ మెజార్టీతో నీలం మధు విజయం ఖాయం



నవ తెలంగాణ-రాయపోల్

మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బడుగు బలహీనవర్గాల ముద్దుబిడ్డ నీలం మధు ముదిరాజ్ భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని దానిలో భాగంగానే గతంలో జరిగిన సాధారణ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని ఇంటికి పంపించారని, కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారన్నారు. సోమవారం జరిగిన లోక్ సభ ఎన్నికలలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని సమాచారం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పాలన చేపట్టడం జరిగిందన్నారు. 100 రోజుల్లోనే 6 గ్యారంటీలను అమలు చేసి ప్రజల మెప్పు పొందడం జరిగిందన్నారు. గత బీఆర్ఎస్ పాలనకు విసుగు చెందిన రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. మెదక్ నియోజకవర్గంలో నీలం మధు ఎన్నో సామాజిక ప్రజా సేవా కార్యక్రమాలు చేపట్టారని అతని సేవా కార్యక్రమాలు విజయానికి దోహదపడతాయన్నారు. మెదక్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌ను భారీ మెజారిటీతో గెలిపించి రాహుల్ గాంధీకి బహుమతిగా ఇవ్వడం జరుగుతుందన్నారు.

ఓటు వేసి సెల్ఫీ తీసి వాట్సాప్ స్టేటస్‌లో పెట్టి..

కేసు నమోదు చేసిన పోలీసులు

నవతెలంగాణ-చిలిపిచేడ్

మండల పరిధిలోని రహీం గూడా తాండ గ్రామపంచాయతీకి చెందిన మేకల ప్రేమ్ కుమార్ ఓటు వేసి సెల్ఫీ తీసుకొని వీడియోను స్టేటస్‌లో పెట్టుకున్నాడు. 1 నెంబర్‌పై ఓటు వేసి నీలం మధు ముదిరాజ్‌కు ఓటు వేసినట్లు సెల్ఫీ వీడియో తీసుకొని స్టేటస్‌లో పెట్టుకున్నాడు. సోమవారం ఈ విషయాన్ని తెలుసుకున్న ఎలక్షన్ అధికారులు ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధంగా వీడియో తీసినందుకు మేకల ప్రవీణ్ కుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. చట్టానికి విరుద్ధంగా ఓటు వేయడం, ఓటును బహిర్గతం చేయకూడదని ఆయన అన్నారు.

చైతన్యవంతమైన సిద్దిపేటలో ఓటింగ్ శాతం తక్కువ

అత్యధికం దుబ్బాక... అత్యల్పం సిద్దిపేటలో ఓటింగ్
జిల్లాలో 77.80 శాతం పోలింగ్



నవ తెలంగాణ-సిద్దిపేట

లోకసభకు జరిగిన ఎన్నికలలో ఇతర నియోజకవర్గాలకంటే సిద్దిపేట నియోజకవర్గంలో ఓటింగ్ శాతం మాత్రం తక్కువగా నమోదైంది. సిద్దిపేటలోని ప్రజలు అన్ని రంగాలలో, చైతన్యంలో ముందు ఉన్నప్పటికీ ఓటు హక్కును వినియోగించుకోవడంలో మాత్రం వెనకబడి ఉన్నారు. జిల్లాలో దుబ్బాకలో అత్యధికంగా ఓటింగ్ అయితే, సిద్దిపేటలో అత్యల్పంగా పోలింగ్ నమోదు అయింది. జిల్లాలో 77.80 శాతం పోలింగ్ జరిగింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఓటింగ్ 77.25 శాతం, సిద్దిపేట నియోజకవర్గంలో ఓటింగ్ 73.64 శాతం, దుబ్బాక నియోజకవర్గంలో ఓటింగ్ 82.42 శాతం, గజ్వేల్ నియోజకవర్గంలో ఓటింగ్ 80.31 శాతం నమోదు అయింది.

సిద్దిపేటలో..

సిద్దిపేట నియోజకవర్గంలో 2,37,591 మంది ఓటర్లు ఉండగా, 1,74,969 మంది ఓటర్లు మాత్రమే ఓటు హక్కును వినియోగించుకున్నారు. 1,16,436 మంది పురుషులు ఉండగా 87,030 మంది మాత్రమే ఓటు వేశారు. 1,21,084 మంది మహిళలు ఉండగా 87,912 మంది మాత్రమే ఓటు వేశారు. 71 మంది ఇతర ఓటర్లు ఉండగా 27 మంది మాత్రమే ఓటు వేశారు. 73.64 శాతం పోలింగ్ నమోదయింది.

దుబ్బాకలో....

దుబ్బాక నియోజకవర్గంలో 2,00,125 మంది ఓటర్లు ఉండగా 1, 64, 952 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 97,198 మంది పురుషులు ఉండగా 81,426 మంది ఓటు వేశారు. 1,02,927 మంది మహిళా ఓటర్లు ఉండగా 83, 526 మంది ఓటు వేశారు. 82.42 శాతం పోలింగ్ నమోదయింది.

గజ్వేల్‌లో..

గజ్వేల్ నియోజకవర్గంలో 2,80,913 మంది ఓటర్లు ఉండగా 2,25,607 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,38,186 మంది పురుషులకు 1,13,239 మంది, 1,42,722 మంది మహిళలకు 1, 12, 366 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 5 ఇతర ఓటర్లకు ఇద్దరు వినియోగించుకున్నారు. 80.31 శాతం పోలింగ్ నమోదయింది.

కరీంనగర్‌లో...

కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో 2,47,701 మంది ఓటర్లు ఉండగా 1,91, 361 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 1,21,715 మంది పురుషులకు 95, 222 మంది, 1,25,981 మంది మహిళలకు 96, 137 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 5 ఇతర ఓటర్లకు ఇద్దరు వినియోగించుకున్నారు. 77.25 శాతం పోలింగ్ నమోదయింది.

ప్రతిపాధనలకే పరిమితమైన 30 పడకల ఆసుపత్రి

నవతెలంగాణ-పెద్దశంకరంపేట



మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలో 30 పడకల ఆసుపత్రి ప్రతిపాదనలకే పరిమితం కావడంతో గ్రామీణ ప్రాంతాలలోని నిరుపేద రోగులు తీవ్ర ఇబందులు ఎదుర్కొటున్నారు. 40 ఏళ్ల క్రితం పెద్దశంకరంపేటలో ఆరు పడకల ఆసుపత్రి ఏర్పాటు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పెద్దశంకరంపేట ఆసుపత్రి స్థాయిని 30 పడకలకు పెంచాలని ప్రభుత్వనికి ప్రతి పాదనలు పంపినా ఆసుపత్రి స్థాయి మాత్రం పెరగలేదు. వైద్యులు, సిబ్బంది పది గంటలకు విధులకు హాజరై సాయంత్రం 4 గంటలకు తిరిగి సొంత ప్రాంతాలకు వెళ్లడంతో రాత్రి పూట ఆసుపత్రికి వచ్చే రోగులకు సరియైన వైద్య సేవలు లభించని దుస్థితి నెలకొంది. ఆరు పడకల ఆసుపత్రి స్థాయిని 30 పడకలకు పెంచితే ప్రభుత్వం వివిధ రంగాలలో నిష్టాతులైన ఆరు మంది డాక్టర్లను నియమించడంతో పాటు 24 గంటల పాటు ఎవరో ఒక డాక్టర్ ప్రజలకు అందుబాటులో ఉండాలి. కానీ ఈ విషయాన్ని పాలక వర్గంగాని ప్రజా ప్రతినిధులుగాని, ఇటు ప్రతిపాదనలుగాని పట్టించుకునే పరిస్థితి లేదు. ఇంకో వైపు మండలంలోని గ్రామాల్లో పనిచేసే హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు శనివారం బుధవారం మాత్రమే ఉంటారు. మిగతా దినాలో అందుబాటులో ఉండడం లేదు. దీంతో ఈ రెండు రోజులు మినహా మిగతా పనిదినాలలో గర్భిణీ స్త్రీలకు గ్రామీణ ప్రాంత ప్రజలకు ఏమైనా వ్యాధులు సోకితే మెదక్ సంగారెడ్డి, నారాయణఖేడ్ ప్రాంతాలకు వెళ్లాల్సిందే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పేట సర్పంచ్ అలుగులా సత్యనారాయణ నారాయణ ఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ రెడ్డిని కలిసి పెద్దశంకరంపేట ఆసుపత్రి స్థాయిని 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికార పార్టీ నాయకులు పట్టిచుకోక పోవడం పట్ల ఈ ప్రాంత ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో నేషనల్ హైవే రోడ్డు కావడంతో ప్రమాదాలు జరిగినపుడు అందుబాటులో డాక్టర్‌లు లేక పోవడంతో సంగారెడ్డి, హైదరాబాద్ వెళ్తూ, బాధ పడుతూ ప్రాణాలు కోల్పోవాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్దశంకరంపేటలో 30 పడకల ఏర్పాటు చేస్తే రేగోడ్, అల్లాదుర్గ్, నిజాంపేట్, టేక్మాల్ మండలాల ప్రజలకు కూడా నాణ్యమైన వైద్య సేవలు లభిస్తాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెద్దశంకరంపేట ఆసుపత్రి స్థాయిని ఆరు పడకల నుంచి 30 పడకలకు పెంచుతూ, ప్రభుత్వం ఆసుపత్రిని మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



30 పడకలకు పెంచాలి



బి సంగమేశ్వర్ టెంకటి

పెద్దశంకరంపేటలో ఆరు పడకల ఆసుపత్రి మాత్రమే ఉండడంతో ప్రజలకు సరియైన వైద్య సేవలు అందడంలేదు. ఈ ఆసుపత్రి స్థాయిని 30 పడకలకు పెంచితే డాక్టర్లు అందుబాటులో ఉండడంతో పాటు ఐదు మండలాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయి.

ఉద్యోగులు అందుబాటులో ఉండాలి



భాగయ్య బూర్గుపల్లి

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సూపర్ వైజర్లు, ఏఎన్ఏంలు తాము పనిచేసే గ్రామాలలో ఉండడం లేదు . రోగులుకు సరియైన వైద్యం అందడం లేదు. పేద ప్రజలకు ఉచిత వైద్యం అందాలంటే ఏఎన్ఏం, హెల్త్ సూపర్ వైజర్లు పని చేసే గ్రామాల్లో విధులు నిర్వహించాలి.

ప్రతి పాదనలు పంపాం



డాక్టర్. వేద శ్రీ వైద్యాధికారి పెద్దశంకరంపేట

మండల కేంద్రమైన పెద్దశంకంపేటలో 30 పడకల ఆసుపత్రి అదనపు గదులకు అవసరమైన స్థలం అందుబాటులో ఉంది. పెద్దశంకరంపేట ఆసుపత్రిని ఆరు పడకల నుంచి 30 పడకలకు పెంచాల్సిందింగా ప్రభుత్వానికి ప్రతి పాదనలు పంపాం.

పటిష్ట భద్రత మధ్య ఈవీఎంలు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

నవతెలంగాణ - మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ పార్లమెంట్‌లో ఉన్న ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య భద్రపరచడం జరిగిందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వివరించారు మంగళవారం నర్సాపూర్ బివిఆర్ఐటి కళాశాలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను స్ట్రాంగ్ రూవమ్‌లో భద్రపరచుట, సీల్ వేయడంలో భాగంగా సాధారణ పరిశీలకులు సమీర్ మాధవ్ కుర్కోటి సమక్షంలో సంబంధిత నియోజకవర్గాల ఏఆర్వోలు రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ రాజ్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి సీల్ వేశారు. దీనితో పాటు పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూంనకు కూడా సీల్ వేయడం జరిగిందని, ఎన్నికలకు సంబంధించిన పేపర్ మెటీరియల్‌కు చెందిన స్క్రూటినీ రిపోర్ట్‌లు, స్టాట్యూటరీ రిపోర్ట్‌లు ఎన్నికల పరిశీలకుల సమక్షం లో సీల్ వేశామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం ఎలక్షన్ పేపర్ స్ట్రాంగ్ రూం ను ఓపెన్ చేసి అబ్జార్వర్ అభ్యర్థుల తరపున వచ్చిన ప్రజా ప్రతినిధుల సమక్షంలో స్క్రూటినీ చేయడం జరిగిందని మెదక్ పార్లమెంట్ నియోజక వర్గ పరిధిలోని ఆయా అసెంబ్లీ సెగ్మెంట్‌లలో అతి ఎక్కువ అతి తక్కువ పోలింగ్ జరిగిన పోలింగ్ కేంద్రాలు, ఈవిఎంలు, రీప్లేస్మెంట్ జరిగిన బూత్‌లు వంటి వాటిని స్క్రూటిని చేసి పరిశీలించడం జరిగిందని, అన్ని అంశాలు కూడా ఏలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా సాఫీగా, విజయవంతంగా జరిగాయని నిర్ధారణకు రావడం జరిగిందని, అన్ని గణాంకాలు సరిపోవడంతో ఎక్కడ కూడా రీ-పోలింగ్‌కు అవకాశం లేదని మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎలాంటి రీ-పోలింగ్‌కు అవకాశం లేకుండా ఎన్నికలు పూర్తి చేయడం జరిగిందని, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం .75.09% పోలింగ్ నమోదు కావడం జరిగిందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల వారిగా నమోదైన శాతం కూడా వెల్లడించడం జరిగిందని చెప్పారు.



. సీసీ టీవీ కెమెరాల మధ్య, కేంద్ర ప్రభుత్వ సాయుధ దళాల పహారాలో భద్రపరుస్తున్నామన్నారు. గజ్వేల్, దుబ్బాక మెదక్, నర్సాపూర్, సిద్దిపేట నియోజకవర్గాల ఈవియంలను, ఇంజనీరింగ్ కళాశాలలో, సంగారెడ్డి, పటాన్చెరు నియోజకవర్గాల ఈవియంలను ప్రభుత్వ గిరిజన బాలుర జూనియర్ కళాశాలలో భద్రపరిచామన్నారు. మెదక్ పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అత్యధికంగా నర్సాపూర్ నియోజకవర్గంలో 84.25 శాతం నమోదు కాగా అత్యల్పంగా పటాన్‌చెరు నియోజకవర్గంలో 63.01 శాతంగా నమోదు అయిందన్నారు.

గత 2019 పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల కంటే ఇప్పుడు 2024లో దాదాపు 4 శాతం పైగా ఓటింగ్ పెరిగిందని కలెక్టర్ రాహుల్ రాజ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అదరపు కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా ఎస్పీ బాల స్వామి, అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు, నియోజకవర్గాల ఏఆర్వోలు, డీఎస్పీలు, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రాస్ ఓటింగ్ కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా.!

- బీఆర్ఎస్ ఓట్లు బీజేపీకి పడినట్లు చర్చ
- బీసీ రిజర్వ్ కావడంతో ముదిరాజ్‌ల ఓట్లు కీలకంగా మార్పు
- మెదక్ పార్లమెంట్ పరిధిలో 18.19లక్షల పైచిలుకు ఓటర్లు
- నర్సాపూర్ నియోజకవర్గంలోనే అత్యధిక ముదిరాజ్‌ల ఓట్లు 70 నుంచి 80 వేలు







నవతెలంగాణ-కొల్చారం

జనరల్ స్థానమైన మెదక్ పార్లమెంట్ పరిధిలో దుబ్బాక, గజ్వేల్, మెదక్, నర్సాపూర్, పటాన్చెరు, సంగారెడ్డి, సిద్దిపేట అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. వీటిల్లో దాదాపు 18 లక్షల 19 వేల ఓట్లకు పై చిలుకు ఓటర్లు ఉండగా వీటిలో 6 నుంచి 7 లక్షల ఓట్లు ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందినవి కావడంతో ఇవి కాంగ్రెస్‌కు కలిసివస్తుందని హైకమాండ్ భావించి బీసీ సామాజిక వర్గానికి చెందిన నీలం మధు ముదిరాజ్‌ను అభ్యర్థిగా ప్రకటించిన విషయం తెలిసిందే. అదే తరహాలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో దాదాపు అన్ని అసెంబ్లీ స్థానాల్లో సైలెంట్ ఓటింగ్ కొనసాగినట్లు పోలింగ్ సరళిని బట్టి తెలుస్తోంది. మెదక్ పార్లమెంట్ నుంచి 40 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ స్థానంలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే పోరు కొనసాగింది. ఉదయం మందకొడిగా, తొమ్మిది తర్వాత కొంత పుంజుకోవడం.. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి తగ్గడం.. చివరి రెండు గంటల్లో అధిక సంఖ్యలో ఓటర్లు బారులుదీరిన క్రమంలో సైలెంట్ ఓటింగ్ కొనసాగినట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో ప్రధాన పార్టీల నుంచి బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు ఓసి కేటగిరీ కి చెందిన వారు కాగా కాంగ్రెస్ అభ్యర్థి బీసీ ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో బీసీల ఓట్లతో పాటు ముదిరాజ్‌ల ఓట్లు కీలకంగా మరినట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అత్యధిక ముదిరాజ్‌ల ఓట్ల సంఖ్య నర్సాపూర్ నియోజకవర్గంలో 70 నుంచి 80 వేల ఓట్లు ఉన్నాయి. ఇవన్నీ కాంగ్రెస్‌కు కలిసొస్తాయని ధీమా వ్యక్తంచేస్తున్నారు. అలాగే దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి గెలిచిన సందర్భాలున్నాయని ఇప్పుడు మళ్లీ ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపిస్తామన్న కాంగ్రెస్ ఈ స్థానంపై గట్టి ఫోకస్ చేసిందని చెప్పుకోవచ్చు. ఎలాగైనా మెదక్ పార్లమెంట్‌ను తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ విశ్వప్రయత్నాలు చేసింది. ఇవన్నీ కాంగ్రెస్‌కు కలిసివచ్చే చాన్స్ ఉందని కొందరు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు ఎవరిని తమ ప్రతినిధిగా లోక్‌సభకు పంపిస్తారో వేచిచూడాల్సిందే.

గెలుపుపై మూడు పార్టీల్లో ధీమా

- ఇరు మండలాల్లో కొంత మేరకు తగ్గిన పోలింగ్
- తూప్రాన్ మండలంలో 76.17
- మనోహరాబాద్ మండలంలో 83.80 శాతం పోలింగ్
- మూడు పార్టీల నాయకులు జోరుగా ప్రచారాలు

నవతెలంగాణ-మనోహరాబాద్

పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ఉదయం నుంచి ప్రశాంత వాతారణంలో ముగిసాయి. కాగా గ్రామాలలో జరిగిన పోలింగ్ సరళిని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపి పార్టీలు బేరీజు వేసుకుంటున్నాయి. తమ పార్టీకే ప్రజలు మొగ్గు చూపారని ప్రజలంతా అభివృద్ధిని చూసి ఓట్లేశారని తమ పార్టీకే ఓట్లు పడ్డాయనే ధీమాతో మూడు పార్టీల నాయకులు వ్యక్తం చేస్తున్నారు. తూప్రాన్ మండలంలో 76.17 శాతం ఓటింగ్ నమోదు కాగా, మనోహరాబాద్ మండలంలో 83.80 శాతం ఓటింగ్ నమోదైంది. గ్రామాలలో కూడ అత్యధిక శాతం ఓటింగ్ నమోదైంది. కాగా మూడు పార్టీల నాయకులు మాత్రం గ్రామాలలో ప్రజలు తమ పార్టీకే ఎక్కవగా మొగ్గు చూపారంటూ తమదే విజయం అనే స్థాయిలో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ ముందంజలో ఉందని గతంలో కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి మంత్రాన్ని ప్రజల వద్దకు తీసుకెల్లామని ప్రజలు కూడా కేసీఆర్ వైపే ఉన్నారని అందుచేతనే ప్రజలంతా బీఆర్ఎస్‌కే ఓటేశారంటూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ప్రజచారంలో కూడా బీఆర్ఎస్ పార్టీ ముందంజలోనే ఉన్నదని చెప్పవచ్చు. అలాగే అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా తమ కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల ప్రకటనతో ప్రజలంతా కాంగ్రెస్‌వైపే ఉన్నారని అలాగే ఆరు గ్యారెంటీలలో ఐదింటిని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ అమలు చేయడంతో ప్రజలు కాంగ్రెస్ వైపే ఉన్నారని అటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అందుకు తోడుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ముదిరాజ్ కావడంతో ముదిరాజ్‌లలో కూడా తమ అభ్యర్థికే మద్దతు తెలుపుతూ అభ్యర్థి నీలం మధుకు ఓట్లేసినట్టు ఆ వర్గం చెప్పుకుంటున్నారు. కాగా కాంగ్రెస్ పార్టీకి మాత్రం అధికారంలో ఉండడంతో ఈ సారి కాంగ్రెస్ పార్టీకి కలిసి వచ్చే అవకాశం కొంతలో కొంత ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల్లో ఉంది. అలాగే బీజేపి హవా మాత్రం యువతలో ఉన్నప్పటికి అధిక శాతం కేవలం మోదీ జపం కొనసాగిందనే చెప్పవచ్చు. మోధీతో పాటు అభ్యర్థి రఘునందన్‌రావ్‌తో ఉన్న సంబంధాలతో బీజేపి పార్టీకి కూడా ఓట్లు పడే అవకాశం ఎక్కవగానే ఉంది. తూప్రాన్, మనోహరాబాద్ మండలాల్లో జరిగిన ఓటింగ్ సరళితో మూడు పార్టీల్లో కూడా గెలుపు ధీమాతో ఉన్నట్టు ఆయా పార్టీల నాయకుల్లో ఆనందం వ్యక్తమవుతున్నప్పటికి గెలుపు ధీమాలో ఏ పార్టీకి వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నీలం మధు విజయం ఖాయం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి



నవతెలంగాణ-గజ్వేల్

మెదక్ పార్లమెంటులో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు విజయం ఖాయమని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమాలతో ప్రజలు తృప్తిగా ఉన్నారని, కాంగ్రెస్ వైపు పెరిగిన ఓటింగ్ శాతం బట్టి చూస్తే విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ వైపు ఉన్నారని పార్లమెంటుకు ఎన్నికల్లో వచ్చే ఫలితాలతో ఇది రుజువవుతుందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు నమ్మకం లేదన్నారు. ఆరు గ్యారెంటీలు ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయని ఆయన చెప్పారు. మహిళలకు బస్సు ప్రయాణం దోహదపడుతుందన్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంకు రూ10 లక్షలు పెంచినట్లు ఆయన తెలిపారు. త్వరలోనే రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినట్లు ఆయన గుర్తు చేశారు. రైతులు సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు.

ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటినందుకు ధన్యవాదాలు

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మెదక్ పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో పాల్గొని, ఓటు హక్కు వినియోగించుకున్న ప్రజలందరికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు ద్వారా తమ నిర్ణయాన్ని వెలిబుచ్చే ఈ పవిత్ర కార్యంలో పాల్గొని, ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రదర్శించిన మెదక్ పార్లమెంట్ పరిధిలోని అన్నదమ్ముళ్లు, అక్క చెల్లెళ్లకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగించిన అధికారులు, పోలీస్‌లు అందరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 50 రోజుల పాటు రేయింబవళ్ళు శ్రమించిన బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులందరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు.

ఉపాధ్యాయులపై లాఠీ చార్జి అమానుషం

- బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజేందర్ రెడ్డి, మల్లికార్జున్



నవతెలంగాణ-సిద్దిపేట

నారాయణఖేడ్ అసెంబ్లీ సెగ్మెంట్ ప్రాంతంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీ చార్జ్ చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు విజేందర్ రెడ్డి, మల్లికార్జున్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన తమకు రావాల్సిన 5 రోజుల భత్యం రాష్ట్ర వ్యాప్తంగా ఏక రీతిగా ఇవ్వాలని డిమాండ్ చేసినందుకు అమానుషంగా, అమానవీయంగా పోలీసులు లాఠీచార్జ్ చేయడం బాధాకరమన్నారు. రెండు రోజులు ఓపికతో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. న్యాయంగా తమకు రావాల్సిన వేతన భత్యాలను ఇవ్వాలని అడిగిన ఉపాధ్యాయులపై పోలీసు బలగాలతో దాడులు చేయడం అత్యంత ధారుణమన్నారు. ఎన్నికల శిక్షణలో ఉపాధ్యాయులు విధుల పట్ల ఎంతో అంకిత భావంతో పనిచేస్తారని పొగిడిన అధికారులే, పనులు ముగించుకున్నాక దాడులు చేయించడం అత్యంత దారుణమన్నారు. ఈ ఘటనను ఖండిస్తూ, గొడవకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నిక సంఘాన్ని డిమాండ్ చేస్తున్నామని వారు తెలిపారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత

నవతెలంగాణ-వర్గల్

మండలంలోని నవోదయ విద్యాలయ విద్యార్థులకు ఏప్రిల్ నెలలో జరిగిన 12వ తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. 33 మంది విద్యార్థులు పరీక్షలో పాల్గొనగా 33 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పదోతరగతిలో 74 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పదోతరగతి, 12వ తరగతి పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ రాజేందర్ అభినందించారు.

మృతురాలి కుటుంబానికి రూ. 5 వేల ఆర్థిక సహాయం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన గంగరబోయిన సత్తవ్వ (కేశపురం) అనారోగ్యంతో మృతి చెందారు. నిరుపేద కుటుంబ పరిస్థితి గురించి గ్రామస్తులు ఫోన్‌లో మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు కడారి ప్రభాకర్ రెడ్డికి తెలియజేశారు. వెంటనే స్పందించిన ప్రభాకర్ రెడ్డి మృతురాలి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. దహన సంస్కారాలకు రూ. 5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయనతో పాటు ముదిరాజ్ సంఘం నాయకులు ఉన్నారు.

యువత బీజేపీ వైపు



నవతెలంగాణ-గజ్వేల్

యువత బీజేపీ వైపు ఉన్నదని విజయం తమదేనని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు మనోహర్ యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావు విజయం ఖాయమన్నారు. గజ్వేల్ నియోజకవర్గంలో పాటు మున్సిపాలిటీలో యువత బీజేపీ వైపు ఆసక్తి చూపారన్నారు. మోడీ అభివృద్ధి మెదక్ పార్లమెంటులో రఘునందన్‌ను గెలిపిస్తుందన్నారు. బీజేపీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల్లో బాగా కష్టపడ్డారని ఆయన చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని రైతులు ప్రజలు బిజెపి వైపు ఉన్నారని పోలింగ్ సరళిని బట్టి స్పష్టమవుతుందన్నారు.

కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు.

- కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

నియోజకవర్గం పరిధిలో పార్లమెంట్ ఎన్నికలలో శ్రమించిన కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోసం దుబ్బాక నియోజక వర్గ నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి మరువలేనిదన్నారు. మెదక్‌లో బహుజన బిడ్డ నీలం మధు ముదిరాజ్ ఎంపీగా ఘనవిజయం సాధించడం ఖాయమని అభిప్రాయం వ్యక్తం చేశారు. గత నెల రోజుల నుంచి మెదక్ అభ్యర్థి నీలం మధు విజయం కోసం ప్రతిక్షణం ప్రజలతో మమేకమవుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా పాలనను వివరిస్తూ అభ్యర్థి విజయమే లక్ష్యంగా కృషి చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

భారీ మెజార్టీతో బీఆర్ఎస్ విజయం ఖాయం

- జెడ్పీటీసీ లక్ష్మీ లింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి



నవతెలంగాణ-మిరుదొడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజార్టీతో బీఆర్ఎస్ గెలుపొందడం ఖాయమని జెడ్పిటిసి లక్ష్మీ లింగం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి కృషి చేసిన పార్టీ కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ప్రలోభాలకు గురిచేసినా ప్రజలు కారు గుర్తుకు ఓటు వేశారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, మాజీ సర్పంచ్ పురం మండల అధ్యక్షుడు బాలరాజు లింగం, నంట బాపురెడ్డి, సత్యనారాయణ, సల్లూరి మల్లేశం, తోట కమలాకర్ రెడ్డి తుమ్మల బాలరాజు, వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు ఐలయ్య దుర్గారెడ్డి బైరయ్య పలువురు పాల్గొన్నారు.

నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్య తీసుకోవాలి

- టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలిహమ్మద్, తప్పెట్ల యాదగిరి.

నవతెలంగాణ-సిద్దిపేట

ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీచార్జ్ చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యతీసుకోవాలనీ టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ వలిహమ్మద్, తప్పెట్ల యాదగిరిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జి చేయించడాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) సిద్దిపేట జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, ప్రిసైడింగ్ ఆఫీసర్ (పిఓ), అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్(ఎపిఓ)లకు రోజుకు రూ 600, అదర్ పోలింగ్ ఆఫీసర్(ఒపిఓ)లకు రూ 400 రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం. 691 ని ఈ నెల 11 న విడుదల చేసిందని తెలిపారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పిఓ, ఎపిఓలకు రూ 3150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో 2400 మాత్రమే ఇచ్చారని తెలిపారు. రాష్ట్రమంతటా ఒకే విధమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని ఉత్తర్వులు ఉన్నప్పటికీ జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోలింగ్ సిబ్బందికి రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు సోమవారం రాత్రి నారాయణఖేడ్‌లో టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలింగ్ ముందు రోజు మెదక్ పార్లమెంటు నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న పోలింగ్ సిబ్బందికి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులు 691 ప్రకారం ఒకే రకమైన రెమ్యూనరేషన్ చెల్లించాలని టిఎస్ యుటిఎఫ్ సిద్దిపేట జిల్లా కమిటీ పక్షాన ప్రాతినిధ్యం చేయడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్ర ఉత్తర్వుల ప్రకారమే సిద్దిపేట జిల్లా కలెక్టర్ పోలింగ్ సిబ్బందికి రెమ్యూనరేషన్ అందించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.



నవతెలంగాణ-జగదేవపూర్

ఉపాధ్యాయులపై పోలీసులతో లాఠీ చార్జి చేయించిన నారాయణఖేడ్ ఆర్డీఓపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ డిమాండ్ చేశారు. లాఠీచార్జికి బాధ్యులైన ఆర్డీఓ, పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ఒకే రకమైన రెమ్యూనరేషన్ ఇవ్వాలని, పిఓ, ఎపిఓ లకు రోజుకు రూ 600, ఒపిఓ లకు రూ 400 రాష్ట్ర ప్రభుత్వం జిఓ నెం. 691 ని ఈ నెల 11 న విడుదల చేసిందన్నారు. ఆ ఉత్తర్వుల ప్రకారమే మెదక్ నియోజకవర్గం పరిధిలోని మెదక్, నర్సాపూర్, సిద్దిపేట, గజ్వేల్ నియోజకవర్గాల్లో పిఓ, ఎపిఓలకు రూ. 3150లు చెల్లించగా, నారాయణఖేడ్‌లో 2400 మాత్రమే ఇచ్చారు. ఒకే పార్లమెంట్ నియోజకవర్గంలో రెమ్యూనరేషన్ చెల్లింపులో తేడా ఎందుకని ప్రశ్నించినందుకు టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి టి లక్ష్మారెడ్డి, ఇతర ఉపాధ్యాయులపై ఆర్డీఓ ఆదేశాల మేరకు పోలీసులు విచక్షణారహితంగా లాఠీచార్జి చేసి ఉపాధ్యాయులను గాయపరిచారన్నారు. నిబంధనలను పాటించకుండా, ప్రశ్నించిన ఉపాధ్యాయులపై దౌర్జన్యం చేసిన ఆర్డీఓ, పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉపాధ్యాయ సంఘము తరుపున ఉద్యమాన్ని చేపడతామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్నవారిపై లాఠీచార్జి చేయడమేంటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు శివుడు, ప్రధాన కార్యదర్శి రాజనర్సింలు, జిల్లా నాయకులు రాంచంద్రం, కృష్ణ. ప్రవీణ్ కుమార్, మహబూబ్ పాషాలు డిమాండ్ చేశారు.



నాణ్యమైన విద్యాప్రమాణాలతో విద్యాబోధన

- 30వ తేదీ వరకు అడ్మిషన్లు
- కళాశాల ప్రిన్సిపాల్ రాజన్న నాయక్



నవతెలంగాణ-జగదేవపూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యాప్రమాణాలతో విద్యాబోధన కావిస్తున్నామని కళాశాల ప్రిన్సిపాల్ బానోత్ రాజన్న నాయక్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 విద్యాసంవత్సరానికిగాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు ప్రారంభమైనాయని తెలిపారు. జిల్లాలోనే ప్రథమ ప్రభుత్వ జూనియర్ కళాశాలగా ప్రారంభించబడి గత 50 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల బడుగు బలహీనవర్గ విద్యార్థులకు సేవలు అందిస్తున్నదని తెలిపారు. ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ప్రస్తుతం ఉన్నత ఉద్యోగ స్థానాల్లో ఉన్నారన్నారు. ప్రశాంత వాతావరణంలో పక్కా భవనంలో అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. కళాశాలలో ఎంపిసి, బిపిసి, సీఈసీ, హెచ్ ఈ సి, ఈటి ఒకేషల్, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో అడ్మిషన్లు ఉన్నాయని తెలిపారు. ఉచిత విద్యతో. పాటు ఉచిత పాఠ్యపుస్తకాలు స్కాలర్షిప్ సౌకర్యం కలదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 9వ తేది నుంచి ప్రారంభమైన మొదటి దశ అడ్మిషన్లు ఈ నెల 30వ తేది వరకు కొనసాగుతాయన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలి

విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ కళాశాలలోనే చేర్పించాలని రాజన్న నాయక్ సూచించారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలన్నారు. విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేదని, అందుబాటులో ఉన్న కళాశాలను సద్వినియోగం. చేసుకోవాలని ఆయన కోరారు.



కాంగ్రెస్ నాయకుల జోలికి వస్తే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఖబర్దార్

నవతెలంగాణ-మద్దూరు

గుండాయిజంతో రాజ్యమేలాలని చూస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి కాంగ్రెస్ నాయకుల జోలికి వస్తే ఖబర్దార్ అని జిల్లా నాయకులు కామిడీ జీవన్ రెడ్డి, జక్కిరెడ్డి సుదర్శన్ రెడ్డిలు హెచ్చరించారు. మండల కేంద్రంలో మంగళవారం మండల అధ్యక్షుడు మేక మల్లేశం అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ చేర్యాల పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్ నాయకులు పార్టీ కండువాలు కప్పుకొని ప్రచారం చేస్తుండడంతో. రాష్ట్ర యువ నాయకుడు కొమ్మూరి రాకేష్ రెడ్డి పోలింగ్ కేంద్రం వద్ద ప్రశ్నించడంతో అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులపై దాడి చేయడం సిగ్గుచేటన్నారు. జనగామ జిల్లా డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాపరెడ్డి అండతో భువనగిరి ఎంపీగా చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలవడం ఖాయమని, అది ఓర్వలేకనే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఇలాంటి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నాడన్నారు. స్థానికేతరుడైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి స్థానికుల మధ్య విభేదాలు సృష్టించి, భౌతిక దాడులకు పాల్పడడంతో పాటు ఎలక్షన్ కమిషన్ నిబంధనలు ఉల్లంఘించి నిరంకుశ పోకడలకు పోతున్నాడని వారు తెలిపారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి అతని అనుచరులపై ఎలక్షన్ కమిషన్ స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ముస్త్యాల మనోహర్, మండల నాయకులు ఇట్టబోయిన కనక చంద్రం, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్రబచ్చుల శ్రీకాంత్ యూత్ ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి వీరేందర్ గౌడ్, బత్తిని కనకయ్య, తదితరులు పాల్గొన్నారు



విజయం బీఆర్ఎస్ పార్టీ వైపే

- ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి



నవతెలంగాణ -గజ్వేల్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ వైపై ప్రజలు ఉన్నారని ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజలు గుర్తించి కారు గుర్తుకు ఓటు వేశారని, వెంకటరామిరెడ్డి విజయం ఖాయమన్నారు. గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీ వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత నెల రోజులుగా కార్యకర్తలు గ్రామ గ్రామాన ప్రచారానికి వెళ్లినప్పుడు బీఆర్ఎస్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. కాంగ్రెస్‌పై రైతుల్లో అప్పుడే వ్యతిరేకత వచ్చిందని ఆయన చెప్పారు. మతతత్వ పార్టీ బిజెపికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

కార్యకర్తల కుటుంబాలను పరామర్శించిన మాదాసు శ్రీనివాస్



నవతెలంగాణ-గజ్వేల్

మండలంలోని జాలిగమ గ్రామానికి చెందిన కోయడ నీరజ గుండెపోటుతో మృతి చెందారు. చిన్న వయస్సులో మృత్యువాత పడటం పట్ల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ సానుభూతిని వ్యక్తం చేస్తూ వారి కుటుంబాన్ని పరామర్శించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే విదంగా అదే గ్రామానికి చెందిన మాజీ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గౌటి బిక్షపతి ఇటీవల పక్షవాతం వచ్చి అనారోగ్యానికి గురి కాగా, వారిని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధ పడుతున్న బీఆర్ఎస్ కార్యకర్తల మాచపురం సామిని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసి పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో పార్టీ పటిష్టంగా అవతరించిందన్నారు. కార్యకర్తలతోనే పార్టీకి పునాది ఏర్పడుతుందన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం వారి పేరు మీద పార్టీ సభ్యత్వం చేపట్టి ఏదైనా ప్రమాదవశాత్తు మరణం సంభవిస్తే రూ.2 లక్షలను మృతు కుటుంబాలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు అశోక్ రావు, మండల ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శివయ్య, బాల్ నర్సయ్య, రాజేశ్వర్ రెడ్డి, నరసింహులు గౌడ్, నరేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మురళి, యాదగిరి కొమురయ్య, నర్సింలు, ఎల్లం, శంకర్, శ్రీను, నర్సింలు, అనిల్ గౌడ్, శ్రీకాంత్, మధు, శ్రీనివాస్, మహేష్, భూపాల్ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థికి సన్మానం




నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్‌కి సంబంధించిన ఆకుల సుశ్రుత్ అనే విద్యార్థి సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన భారతీయ విద్యా భవన్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని ఆకుల సుశ్రుత్‌ను నవజీవన ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. మొత్తం500 మార్కులకుగాను సుశ్రుత్ 491 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా ఆకుల సుశ్రుత్ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకుని ఆ రంగంలో నిరంతర సాధన ద్వారా రాణించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.మంద సాయినాథ్ రెడ్డి, డా.ఆకుల నరేశ్ బాబు, వంగాల రంగాచారి, సరస్వతీ శిశు మందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీమతి హరిణ పవన్, శ్రీమతి సావిత్రి, శ్రీ ప్రసన్న లక్ష్మి బాసెట్టి విష్ణు, కడారి నరేందర్ తదితరులు పాల్గొని అభినందించారు.

నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలి

- దుబ్బాక నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్



నవతెలంగాణ-మిరుదొడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో నిబంధనలను ఉల్లంఘించిన ఉపాధ్యక్షుడిపై చర్యలు తీసుకోవాలని దుబ్బాక నియోజకవర్గం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్ డిమాండ్ చేశారు. దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్ పేట- భూంపల్లి మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు గజబింకర్ అశోక్ నగరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించడంతో పాటు మిగతా పార్టీలకు ఓటు వేయాలని ప్రచారం చేశారన్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుల దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. మండల నాయకుల సమక్షంలో పార్టీ నుంచి గజబింకర్ అశోకుని సస్పెండ్ చేస్తున్నట్లు తీర్మానం చేసి మీడియాకు వెల్లడించారు. పార్టీ నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని, ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు మధు ప్రతాప్ కాంగ్రెస్ నాయకులు రవి, భీమ్రావు, శ్రీధర్బాల గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-తొగుట

మండలంలోని తుక్కాపూర్ గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు వైస్ ఎంపీపీ బాసి రెడ్డి శ్రీకాంత్ రెడ్డిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా దాదాపు నెల రోజులుగా బీఆర్ఎస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికలు ముగిసిన సందర్భంగా ఎంపీపీని కలిసి ఓటింగ్ సరళి గురించి చర్చించారు. ఎంపీపీని కలిసిన వారిలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు లింగాల ప్రశాంత్, యూత్ విభాగం ఉపాధ్యక్షులు బరెంకాల దయాకర్, దూలం నవీన్ గౌడ్, మాజీ వార్డు సభ్యుడు బోయిని బాలరాజు, బరెంకాల రవి, లింగాల స్వామి, మాజీ సర్పంచ్ బరింకల రాజయ్య, విద్యార్థి విభాగం ఉపాధ్యక్షు డు బరెంకాల కర్ణాకర్, కుమార్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిక్కుడు రమేష్, బరెంకాల కనక య్య, సోషల్ మీడియా కన్వీనర్ చిక్కుడు రాజులు ఉన్నారు.

బీజేపీ కార్యకర్తలపై దాడి పట్ల ఖండన



నవతెలంగాణ-మర్కుక్

బీజేపీ కార్యకర్త ఉప్పరి మురళిపై బీఆర్ఎస్ రౌడీలతో దాడి చేయించిన మర్కుక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బిజెపి సీనియర్ నాయకులు నందన్ గౌడ్, సింగం సత్తయ్య, బిజెపి మర్కుక్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి రాంరెడ్డి,బి.మహేష్ లు డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రమైన మర్కుక్ బిజెపి మండల ఉపాధ్యాక్షులు తాడూరి మహేశ్ గౌడ్ తో కలసి విలేకర్లతో వారు మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికలలో భాగంగా పాములపర్తి గ్రామంలో బిజెపి పార్టీ తరఫున పోలింగ్ బూత్ ఏజెంటుగా వ్యవహరించిన ఉప్పరి మురళి,పోలింగ్ ముగిసిన తర్వాత ఇంటికి వస్తున్న క్రమంలో అతని పై పాండుగౌడ్ తన అనుచరులతో దాడికి పాల్పడటం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు భూ కబ్జాలు,సెటిల్మెంట్ చేసిన పేద ప్రజలను నమ్మించిన ద్రోహి ఎంపీపీ పాండుగౌడ్ అని అన్నారు. బీజేపీ కార్యకర్తలపై దాడి చేసిన పాండుగౌడ్ అక్రమాలను త్వరలోనే బయట పెడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చైతన్య శంకర్ రెడ్డి, రాజేందర్ సింగ్, రమేష్ గుప్త, కొత్వాల్ రాజు, పాతురు శ్రీను,నవీన్ రెడ్డి,కొండ బాలు, చంద్రం,కరుణాకర్,సంజీవ్ రెడ్డి, బిజెవైఎం అధ్యక్షులు పంజా మధు,మహేందర్, మైసిగారి బాలకృష్ణ, కొండల్, మహేష్, రాజు, బాలకృష్ణ, బోయిని రాజు, లెంకల సురేష్, బొమ్మ స్వామి, మహేష్, నితిన్, మురళీ తదితరులున్నారు.